

నగదుపై నజర్



- ఎన్నికల కోడ్ నేపథ్యంలో డబ్బు తరలింపుపై ఆంక్షలు
- రసీదు చూపితే సరి.. లేదంటే సీజ్
- విభాగాల వారీగా నోడల్ అధికారుల నియామకం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: స్థానిక సంస్థలకు ఎన్నికల కమిషన్ ఇప్పటికే షెడ్యూల్ జారీ చేసింది. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో నగదు తరలింపుపై దృష్టి సారించింది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ స్థానాలకు పోటీ చేయాలని భావించే ఆశావహులు, వారి బంధు మిత్రులపై నిఘా ఉంచింది. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే అవకాశం ఉన్నందున వారి రాక పోకలు సహా బ్యాంక్ అకౌంట్లపైనా దృష్టి పెట్టింది. తనిఖీల్లో రూ.50 వేలకు మించి నగదు దొరికితే పోలీసులు స్వాధీనం చేసుకోనున్నారు. జిల్లా, మండల, గ్రామ సరిహద్దులు, ప్రధాన రహదారులపై పోలీస్ పికెట్లను ఏర్పాటు చేశారు. ఇప్పటికే తనిఖీ విభాగాలకు మండల తహసీల్దార్లను నోడల్ అధికారులుగా నియమించింది. సరైన ఆధారాలు(వస్తు కొనుగోలు/అమ్మకాలకు సంబంధించిన రసీదులు) చూపిస్తే సరి.. లేదంటే ఆయా నగదును స్వాధీనం చేసుకోనుంది. పెద్ద మొత్తంలో మద్యం కొనుగోళ్లు, సరఫరా, బంగారం, వెండి వస్తువులు, చీరలు, ఇతర వస్తు కొనుగోళ్లపైనా నిఘా పెంచారు. ఇప్పటికే ఆయా దుకాణాల యజమానులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై క్రిమినల్ కేసులు నమోదుతో పాటు జైలుకు పంపేందుకు రంగం సిద్ధం చేస్తోంది.

12 విభాగాలకు నోడల్ అధికారులు

21 జెడ్పీటీసీ స్థానాలతో పాటు 230 ఎంపీటీసీ స్థానాలకు తొలి విడతలో, 526 గ్రామ పంచాయతీలు, 4,668 వార్డులకు మలి విడతలో ఎన్నికలు నిర్వహించనుంది. పోలింగ్, కౌంటింగ్ కోసం పకడ్బందీ చర్యలు చేపడుతోంది. ఇందుకు ఎన్నికల కమిషన్ 12 విభాగాలను ఏర్పాటు చేసింది. వీటికి ఒక్కో నోడల్ అధికారిని నియమించింది. పోలింగ్‌కు ఎంత మంది సిబ్బంది అవసరం? ఎక్కడ విధులు నిర్వర్తించాలి? ఓటింగ్‌లో ఎవరు పాల్గొనాలి? కౌంటింగ్‌లో ఎవరు పాల్గొనాలి? తదితర పనుల పర్యవేక్షణకు మానవవనరుల విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఈ హెచ్‌ఆర్ విభాగానికి డీసీఐజీఎం ఎం.శ్రీలక్ష్మిని నోడల్ ఆఫీసర్‌గా నియమించింది. బ్యాలెట్ బాక్సులు ఎన్ని అవసరం? ఎలా సమకూర్చాలి? పోలింగ్ కేంద్రానికి ఎలా తరలించాలి? అటు నుంచి స్ట్రాంగ్ రూమ్‌కు.. ఆ తర్వాత కౌటింగ్ హాల్‌కు ఎలా తరలించాలి? వంటి పర్యవేక్షణకు బ్యాలెట్ బాక్సుల విభాగాన్ని ఏర్పాటు చేసింది. డీపీఓ సురేశ్ మోహన్‌ను దీనికి నోడల్ ఆఫీసర్‌గా నియమించారు. బ్యాలెట్ బాక్సులు, సిబ్బందిని పోలింగ్ బూత్‌లకు తరలింపు, అటు నుంచి మళ్లీ వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు వాహనాలను పెద్ద సంఖ్యలో సమకూర్చాల్సి ఉంది. ఇందుకు ఇబ్రహీంపట్నం ఆర్టీఓ సుభాశ్ చందర్‌రెడ్డిని నోడల్ ఆఫీసర్‌గా నియమించింది. సిబ్బందికి శిక్షణకు డీఈఓ సుశీందర్‌రావు, మెటీరియల్ మేనేజ్‌మెంట్ విభాగానికి శ్రీరామ్ రాములును నోడల్ ఆఫీసర్లుగా నియమించింది.

అభ్యర్థుల ఖర్చులపై నిఘా

ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు భారీగా ఖర్చు చేస్తుంటారు. వాహనాల ర్యాలీలు నిర్వహిస్తుంటారు. గ్రామాల పర్యటనకు వాహనాల వినియోగం, బ్యానర్లు, పోస్టర్లు, ఫ్లెక్సీలు సమకూర్చుకుంటారు.వీటితో పాటు వెంట తిరిగే కార్యకర్తల కు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, మద్యం, మాంసాహారాలను సమకూర్చుతుంటారు.లెక్కకు మించి ఖర్చు చేసే వారిపై గట్టి నిఘాను ఏర్పాటు చేసింది. ఎంసీసీ మానిటరింగ్ నోడల్ ఆఫీసర్‌గా సీపీఓ సౌమ్యను,ఎన్నికల ఖర్చుల పర్యవేక్షణ విభాగం నోడల్ ఆఫీసర్‌గా జిల్లా ఆడిట్ ఆఫీసర్ ఎన్.వెంకట్‌ను, ఎన్నికల పరిశీలకులుగా ఎస్ఎల్ఆర్ ఏడీ కె.శ్రీనివాస్‌ను, ఫిర్యాదుల స్వీకరణ విభాగం నోడల్ ఆఫీసర్‌గా డీఆర్‌డీఓ పీడీ ఎల్.శ్రీలతను, ప్రచార విభాగం నోడల్ ఆఫీసర్‌గా డీపీఆర్‌ఓ పీసీ వెంకటేశ్‌ను, రిటర్న్స్ విభాగం నోడల్ ఆఫీసర్‌గా బి.రంగారావును నియమించింది. వీరంతా కలెక్టరేట్ కేంద్రంగా ఆయా పనులను పర్యవేక్షిస్తుంటారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

టాస్క్ సీఈఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

కడ్తాల్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని టాస్క్ సీఈఓ, ఐక్య ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని గోవిందాయిపల్లిలో దుర్గామాత మిత్ర మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాముమనాయక్, నాయకులు శేఖర్‌గౌడ్, ఎల్లాగౌడ్, శ్రీకాంత్, రాఘవేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.



అమ్మవారి పూజలో సుంకిరెడ్డి

బాకీ కార్డే ప్రచార అస్త్రం


కాంగ్రెస్ బాకీ కార్డులను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి సబితారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

- ఎన్నికలు పూర్తయ్యే వరకు ఇతర పార్టీల వారితో మాట్లాడొద్దు
- జెడ్పీ పీఠాన్ని కేసీఆర్‌కు కానుకగా ఇద్దాం
- మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

చేవెళ్ల: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు కాంగ్రెస్ ఇచ్చిన హామీల బాకీ కార్డు వజ్రాయుధమని.. ఆ కార్డుతోనే ఎన్నికల ప్రచారం చేపట్టి విజయం సాధిస్తామని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని ముడిమ్యాలలో పార్టీ నాయకుడు గోనె కరుణాకర్ రెడ్డి ఫాంహౌస్‌లో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబితా రెడ్డి మాట్లాడుతూ.. ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలు ఒకే సారి పెట్టి గందరగోళం సృష్టించారన్నారు. ఆశావహులంతా కలిసి కూర్చుని గెలిచే అవకాశం ఉన్నవారిని అభ్యర్థిగా ఎంపిక చేసి ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు.. వాటిని అమలు చేయకపోవడాన్ని గుర్తు చేస్తూ కాంగ్రెస్ బాకీ కార్డును చూపిస్తే చాలు బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని చెప్పారు. కోటి మంది మహిళలను కోటీశ్వర్లను చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి ఒక్క కోటీశ్వరాలును చూపాలని ఎద్దేవా చేశారు. ఒక్క యూరియా బస్తాకోసం మహిళలు సర్కస్ ఫీట్లు చేస్తున్నారన్నారు. పార్టీ శ్రేణులు ఎన్నికలు పూర్తయ్యే వరకు ఇతర పార్టీకు చెందిన వారితో కలిసి తిరగడం, మాట్లాడం మానేయాలని.. ఇది ప్రజల్లోకి చెడు సంకేతాలు తీసుకెళ్తుందన్నారు. తాను భౌతికంగా మాత్రమే వేరే చోట ఉన్నానని.. మనస్సు మొత్తం చేవెళ్ల చుట్టే తిరుగుతుందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ రిజర్వేషన్ వచ్చిన నాలుగు జెడ్పీటీసీ స్థానాలు చేవెళ్ల, మహేశ్వరం పరిధిలోనే ఉన్నాయని వీటిని గెలిపించి కేసీఆర్‌కు చైర్మన్ పీఠం గిఫ్ట్‌గా ఇద్దామన్నారు. ఈ సమావేశంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, నియోజకవర్గ నాయకులు అంజనేయులు, కనీస వేతన బోర్డు మాజీ చైర్మన్ నారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, యూత్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, మాజీ వైస్ ఎంపీపీ శివప్రసాద్, సీనియర్ నాయకులు కరుణాకర్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె పోరు.. విందుల జోరు!

- గ్రామాల్లో దసరా, స్థానిక ఎన్నికల సందడి
- ఓటర్లు, నేతల ప్రసన్నం కోసం ఆశావహుల ప్రయత్నాలు

షాద్‌నగర్: అసలే దసరా సమయం.. ఆపై ఎన్నికల సమరం.. ఇంకేముంది పల్లెల్లో విందుల సందడి మొదలైంది. నాయకులను, ప్రజలను ప్రసన్నం చేసుకునేందుకు ఆశావహులు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. పార్టీ అధిష్టానాలు కూడా గెలుపు గుర్రాల వేట మొదలు పెట్టడంతో రాజకీయం రసవత్తంగా మారింది.

మచ్చిక చేసుకునేందుకు..

ఎంపీటీసీ స్థానాల్లో పోటీ చేయాలనుకునే వారు.. సర్పంచ్ పదవి కోసం పార్టీలతో సంబంధం లేకుండా బరిలో నిలిచేందుకు ప్రయత్నిస్తున్న వారిలో కొందరు ఇప్పటికే భారీగా ఖర్చు పెట్టారు. ఇందులో రిజర్వేషన్లు అనుకూలించని నాయకులు ఆవేదనలో ఉండగా అనుకూలంగా వచ్చిన వారు అటు పార్టీల నాయకులను, ఇటు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు. ప్రాదేశిక, పంచాయతీ సమరానికి నగారా మోగిన నేపథ్యంలో పల్లెల్లో విందుల జోరు కొనసాగుతోంది.



విందు రాజకీయాలు

గ్రామాల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలతో పాటు పంచాయతీ ఎలక్షన్ల హడావుడి మొదలైంది. దీంతో బరిలో ఉండాలనుకుంటున్న నాయకులు ప్రజలను మచ్చిక చేసుకునే పనిలో పడ్డారు. రిజర్వేషన్ల పుణ్యమా అని కొన్ని చోట్ల టికెట్ పోరు లేకపోగా, మరికొన్ని చోట్ల తీవ్ర పోటీ నెలకొంది. దీంతో మందు, విందులతో సత్తాచాటేందుకు పోటీదారులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇదే అదనుగా వీరి జేబులు ఖాళీ చేసేందుకు కొంత మంది ఓటర్లు ఇప్పటికే నాయకుల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

సందిగ్ధంలో నేతలు

తాజాగా బీసీలకు ప్రభుత్వం కల్పించిన 42శాతం రిజర్వేషన్ల వ్యవహారం కోర్టు పరిధిలో ఉంది. దీంతో రిజర్వేషన్లపై ప్రజల్లో సందిగ్ధత నెలకొంది. ఈ విషయంపై వారం రోజుల్లో కోర్టు తీర్పు ఎలా ఉండబోతోందోననే భయం ఆశావహులను వెంటాడుతోంది. ప్రధానంగా బీసీ రిజర్వుడు స్థానాలు 42శాతం కొనసాగుతాయా..? ఏమైనా మార్పులు ఉంటాయా అనే అంశంపైనే ఉత్కంఠ సాగుతోంది. అయితే ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో మాత్రం ఎలాంటి మార్పు ఉండబోదనే చర్చ కూడా సాగుతోంది.

ముందే కిక్కు

ఈసారి దసరా పండుగ, గాంధీ జయంతి ఒకే రోజు రావడంతో మద్యం, మాంసం దుకాణాలు తెరుచుకునే అవకాశం లేకుండాపోయింది. ఈక్రమంలో తమ మద్దతుదారులు, అనుచరులను మత్తులో ముంచేందుకు నాయకులు ముందుగానే మద్యం కొనుగోలు చేశారు. గత రెండు రోజులుగా మద్యం దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. పెద్ద ఎత్తున స్టాక్ విక్రయించినట్లు వ్యాపారులు పేర్కొన్నారు.

జాగృతి అధ్యక్షురాలికి స్వాగతం


కవితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కప్పాటి

కందుకూరు: విదేశాల్లో బతుకమ్మ మహోత్సవాలు పూర్తి చేసుకుని వచ్చిన జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కవితను బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో జాగృతి నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విదేశాల్లోనూ ప్రచారం చేస్తున్న కవితకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో జాగృతి నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్, బాబురావు, సభావత్ గణేశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులు అభివృద్ధి సాధించాలి

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్


గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న దశరథ్ నాయక్

కడ్తాల్: గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఎల్‌ఎచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని గానుగుమార్ల తండాలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గిరిజనులు ఆర్థికంగా, సామాజికంగా, విద్య, ఉద్యోగ రంగాల్లో అభివృద్ధి సాధించాలని సూచించారు. అనంతరం తండాలో నిరుద్యోగ యువకుడు ఏర్పాటు చేసిన వ్యాపార కేంద్రాన్ని ప్రారంభించారు. యువత స్వయం ఉపాధి రంగాలపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ సేవ్యానాయక్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, లక్పతినాయక్, మోత్యానాయక్, శ్రీను, భీమన్, టిక్‌లాల్, రాజు, చందర్, లక్ష్మణ్, పవన్, శ్రీను, పవన్, పద్మ పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో ఏఎస్ఐ దుర్మరణం

తాండూరు: విధులకు వెళ్లేందుకు రైలు ఎక్కుతున్న కర్ణాటక రాష్ట్ర పోలీసు శాఖకు చెందిన ఏఎస్సై రైలు ప్రమాదానికి గురై మృతి చెందిన సంఘటన స్థానిక రైల్వే స్టేషన్‌లో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్ర సరిహద్దులోని చించోళి తాలూకా మర్పల్లికి చెందిన మారుతి(49) కల్బుర్గి జిల్లాలోని జేడీ హల్లి పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నాడు. స్వగ్రామానికి వచ్చిన మారుతి తిరిగి విధులకు వెళ్లేందుకు తాండూరు రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. రైలులో కల్బుర్గి వెళ్లేందుకు యశ్వంత్‌పూర్ రైలు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి రైలు కింద పడ్డారు. దీంతో మారుతి రెండు కాళ్లు విరిగిపోయి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయం గమనించిన రైల్వే పోలీసులు వెంటనే అతన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక వైద్యం అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం కల్బుర్గి జిల్లాకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతు బుధవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు.

ఆటపాటలతో బతుకమ్మ సందడి


బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఆమనగల్లు: తెలంగాణ సంస్కృతి సంప్రదాయం అయిన బతుకమ్మ సంబురం బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా తీరొక్క పూలతో పేర్చిన పూలగోపురాలను పట్టణంలోని హనుమాన్ దేవాలయం ప్రాంగణంలో ప్రతిష్ఠించారు. అనంతరం మహిళలు, యువతులు ఆటపాటలతో సందడి చేశారు. సురసముద్రం చెరువులో నిమజ్జనం చేశారు. వేడుకలకు మున్సిపాలిటీ, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. ఉత్సవంలో మున్సిపల్ కమిషనర్ శంకర్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, సీఐ జానకిరాంరెడ్డి, ఎస్ఐ వెంకటేశ్, ఉత్సవ కమిటీ సభ్యులు గుర్రం కేశవులు, కండె హరిప్రసాద్, దుర్గయ్య, నర్సింహ, అప్పం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చెరువులో వ్యక్తి మృతదేహం లభ్యం

పహాడీషరీఫ్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం చెరువులో లభ్యమైంది. ఈ సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగు చూసింది. సీఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్ద చెరువులో ఓ మృతదేహం తేలియాడుతుందని పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని, శవాన్ని బయటకు తీయించారు. మృతుడి వయస్సు 30- 35 మధ్య ఉంటుందని గుర్తించారు. మృతదేహం కుళ్లిన స్థితిలో ఉండటంతో.. వ్యక్తి మృతి చెంది రెండు, మూడు రోజుల అయ్యుంటుందని భావించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రైలుకింద పడి వ్యక్తి మృతి

షాద్‌నగర్‌రూరల్: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మున్సిపాలిటీ పరిధి సోలీపూర్ శివారులోని రైల్వే బ్రిడ్జి సమీపంలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ మల్లేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓ వ్యక్తి(35) రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు నల్లటి గడ్డం కలిగి ఉండి, ఒంటిపై కేవలం గ్రే కలర్ ప్యాంటు మాత్రమే ఉంది. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్టేషన్ మాస్టర్ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామని రైల్వే పోలీసులు తెలిపారు. కాగా.. మృతుడు చుట్టుపక్కల వ్యక్తే అయిండవచ్చని, ఎవరైనా తప్పిపోయినట్లు తెలిస్తే 98480 90426 ఫోన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఇబ్బంది పెట్టేందుకే సర్కార్ కుట్ర


నాంపల్లిలోని అథారిటీ కోర్టు ఎదుట ఫార్మాసిటీ భూబాధితుల నిరసన

ఫార్మాసిటీ భూ బాధితులు

యాచారం: సర్కార్ కావాలనే ఇబ్బందులకు గురి చేస్తోందని ఫార్మాసిటీ భూబాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కుర్మిద్ద, నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి గ్రామాలకు చెందిన 150 మందికి పైగా రైతులకు పక్షం రోజుల క్రితం అథారిటీ నోటీసులు ఇచ్చిన విషయం విదితమే. రైతులకు సమాచారం లేకుండానే పట్టా భూముల పరిహారాన్ని గత బీఆర్ఎస్ సర్కార్ అథారిటీలో జమ చేసింది. ఈ పరిహారం తీసుకునే విషయంలో అభ్యంతరాలు తెలపాలని అథారిటీ నుంచి రైతులకు నోటీసులు అందాయి. దీంతో ఆయా గ్రామాలకు చెందిన రైతులు బుధవారం నాంపల్లిలోని అథారిటీ కోర్టుకు హాజరయ్యారు. నోటీసుల్లో తేదీ ప్రకారం ఆథారిటీ వద్దకు వెళ్లగా జడ్జి సెలవులో ఉన్నారని అధికారులు సైతం ఈ రోజు రారని సిబ్బంది రైతులకు తెలియజేశారు. నోటీసులు అందిన తేదీ ప్రకారం అథారిటీ వద్దకు వచ్చామని జడ్జి సెలవు తీసుకుంటే.. అధికారులు ఎవరూ రాకపోతే తమ అభ్యంతరాలు, బాధలు ఎవ్వరికి చెప్పుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. ముందే సమాచారం ఇస్తే రాకపోయే వారం కదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అథారిటీ ఎదుట నోటీసులు చూపుతూ బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.

రైతులను కోదండరాం సంఘీభావం

నాంపల్లిలోని అథారిటీ వద్దకు వచ్చిన రైతులతో ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడారు. ఆరు నెలలుగా ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో సర్కార్ పోలీసుల బందోబస్తు నడుమ ఫెన్సింగ్ వేస్తోందని.. బెదిరింపులకు పాల్పడుతోందని వివరించారు. ఇందుకు స్పందించిన కోదండరాం వెంటనే జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబుతో మాట్లాడి సమస్యలు తీరుస్తానని భరోసా ఇచ్చారు.

కాంగ్రెస్‌కు ఓట్లు అడిగే అర్హత లేదు

మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్: హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడిగే అర్హత లేదని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల కోసం రెండు సార్లు మాత్రమే రైతు బంధు ఇచ్చిందన్నారు. హామీ మేరకు ఎకరానికి రూ.15వేలు చెల్లించాలన్నారు. రుణమాఫీ పూర్తి స్థాయిలో కాలేదన్నారు. మహిళలకు రూ.2,500 చెల్లించలేదన్నారు. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెకును పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, నాయకులు మధుయాదవ్, ముదిగండ్ల కృష్ణ, దయాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఎరన్‌పల్లి శ్రీనివాస్, నర్మద కిష్టప్ప పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో పోటీ

డీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భిక్షపతి


భిక్షపతితో పార్టీ నాయకులు

షాద్‌నగర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్పీ) పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భిక్షపతి అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని చటాన్‌పల్లి కమ్యూనిటీ హాల్‌లో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజానికి కొత్త నాయకత్వం అవసరముందని.. అది విశారదన్ మహరాజ్ నాయకత్వంలోని డీఎస్పీతోనే సాధ్యమన్నారు. పార్టీ నాయకులు అభ్యర్థుల గెలుపనకు శక్తి వంచన లేకుండా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు అహ్మద్‌పాషా, రాకేశ్, మల్లేశ్, నర్సింహ, దాసు, రాములు, పెంటయ్య, భవానీ శేఖర్, రవీంద్ర, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం


సన్మానం అందుకున్న మస్రత్ ఫాతిమా

పహాడీషరీఫ్: గృహిణులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతూ.. వారికి న్యాయం చేసేందుకు అండగా నిలుస్తున్న ఫాతిమా మహిళా మండలి అధ్యక్షురాలు మస్రత్ ఫాతిమాను హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మండలి కార్యదర్శి అబ్దుల్ బషీర్ అల్ ఖురేషీ, సోషల్ జస్టిస్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఖాజా పాషాను హెచ్ఆర్‌సీ ప్రతినిధి మహ్మద్ ఫిరోజ్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి, శాలువాతో సత్కరించారు. ముస్లిం మైనార్టీలకు గృహహింసకు సంబంధించి అవగాహన కార్యక్రమాలు చేపడుతూ.. వారికి న్యాయపరంగా సహాయ సహకారాలు అందించడం గొప్ప విషయమన్నారు.

ట్రక్కు-బైక్ ఢీకొని వ్యక్తి మృతి


సురేందర్ మృతదేహం

మొయినాబాద్‌రూరల్: ట్రక్కు బైక్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్రమాదం బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మండలం దామరగిద్ద గ్రామానికి చెందిన జోగు సురేందర్(43), మొయినాబాద్ మండలం మెడిపల్లిలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొని.. టీఎస్07 జేక్యూ0572 ద్విచక్ర వాహనపై తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో వీరన్నపేట్ సమీపంలో.. ఎదురుగా వస్తున్న టాటా ట్రక్ ఏపీ39 యూఎక్స్2658 ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సురేందర్ తలకు తీవ్రగాయాలు అయి.. అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని ఉస్మానియాకు తరలించారు.

'మర్యాద' యాదన్న!

ఇరకాటంలో చేవెళ్ల ఎమ్మెల్యే

- నవాబుపేట సమావేశంలో స్టేజీపై కుర్చీ కేటాయించిన బీఆర్ఎస్
- పార్టీ ఫిరాయించకపోతే మీటింగ్‌లకు రావాలని పిలుపు
- స్పందించని కాలె


మంగళవారం నవాబుపేటలో నిర్వహించిన బీఆర్ఎస్ సమావేశంలో కాలె యాదయ్యకు వేసిన కుర్చీ

వికారాబాద్: అందరూ మర్యాద యాదయ్యగా పిలుచుకునే చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఇరకాటంలో పడ్డారు. బీఆర్ఎస్ బీఫాంపై గెలిచి కాంగ్రెస్ కండువా కప్పుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం హస్తం గూటిలో తలదాచుకున్న ఆయనకు స్థానిక ఎన్నికలతో పాటు పార్టీ ఫిరాయింపుల చట్టం ఇరకాటంలో పడేసింది. ఒకే సమయంలో స్పీకర్ నోటీసులు, విచారణ, స్థానిక ఎన్నికల కోడ్ అమలులోకి రావడం లాంటి పరిణామాలు చోటు చేసుకోవడంతో ఎప్పుడూ లేని వింత పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తోంది. మంగళవారం తన సొంత మండలం నవాబుపేటలో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాన్ని ఆ పార్టీ నేతలు ఎమ్మెల్యే యాదయ్యను ఇరకాటంలో పెట్టేందుకు వాడుకున్నారు. స్టేజ్‌పై కుర్చి వేసి.. దానికి ఎమ్మెల్యే కాలె యాదయ్య అని పేపరు అతికింది వేదికపైకి రావాలంటూ ఆహ్వానించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

సొంత మండలం నుంచి..

సొంత మండలం నవాబుపేట నుంచి ఎంపీపీగా, జెడ్పీటీసీగా ఆ తర్వాత టీటీడీ బోర్డు సభ్యుడిగా కాలె యాదయ్య ఎదిగారు. కాంగ్రెస్ పార్టీతో తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించి మొదటి సారి ఆ పార్టీ నుంచే ఎమ్మెల్యేగా గెలుపొందారు. రాష్ట్రం విడిపోవడం, ఆ తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం రావడంతో కారు పార్టీలో చేరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బీంఫారంతో పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలు పొందిన ఆయన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో హస్తం గూటికి చేరారు. ఒకరు తరువాత మరొకరు పార్టీని వీడుతుండటంతో కారు పార్టీ అలర్టయ్యింది. పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయా లని కోర్టు గడప తొక్కిన విషయం తెలిసింది. చివరకు ఆ వివాదం సుప్రీంకోర్టు పరిధిలోకి వెళ్లడం, ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో ఏదో ఒక నిర్ణ యం తీసుకోవాలంటూ కోర్టు స్పీకర్‌కు సూచించింది. దీంతో ఇటీవల స్పీకర్ ట్రిబ్యునల్ ముందు ఎమ్మెల్యేలు హాజరై వివరణ ఇచ్చారు. వీరిలో కాలె యాయద్య కూడా ఉన్నారు. ఈ పరిణామాలు జరుగుతున్న సమయంలోనే ఎమ్మెల్యే చేవెళ్లలో మాట్లాడుతూ.. తాను పార్టీ మారలేదని, బీఆర్ఎస్‌లోనే ఉన్నానని వ్యాఖ్యానించారు. దీన్ని ఆసరాగా చేసుకున్న బీఆర్ఎస్ ఇటీవల యాదయ్య సొంత మండలం నవాబుపేటలో జరిగిన సమావేశంలో ఆయనకు గట్టి కౌంటర్ ఇచ్చింది. పార్టీలో ఉంటే స్టేజ్‌పైకి వచ్చి కూర్చోవాలంటూ ఆయన పేరుతో ఓ కుర్చీ వేసి ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి సబితారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ తదితరులు హాజరైన కార్యకర్తల సమావేశంలో కార్యక్రమం పూ ర్తయ్యే వరకు కుర్చీ స్టేజ్‌పై అలాగే ఉంచి యాద య్యను ఇరకాటంలో పెట్టే ప్రయత్నం చేశారు.

కుమారుడికి జెడ్పీ పీఠం కోసం..

2018 అసెంబ్లీ ఎన్నికల్లో యాదయ్య ఎమ్మెల్యేగా రెండోసారి గెలుపొందగా, 2019లో జరిగిన పరిషత్ ఎన్నికల్లో కుమారుడు మొయినాబాద్ జెడ్పీటీసీగా, కోడలు నవాబుపేట ఎంపీపీగా ఎన్నికయ్యారు. ఒకే ఇంట్లో మూడు పదవులు దక్కడంతో యాదయ్య కుటుంబం వార్తల్లోకెక్కింది. ఇదంతా బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో జరిగిందే. ప్రస్తుతం ఆయన ఎమ్మెల్యేగా ఉండగా పాత సంప్రదాయాన్ని మళ్లీ కొనసాగించేందుకు పావులు కదుపుతున్నట్లు సమాచారం. స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయగా చేవెళ్ల నియోజకవర్గంలోని మూడు మండలాలు ఎస్సీ సామాజిక వర్గానికి రిజర్వ్ చేయబడ్డాయి. ఇదే సమయంలో రంగారెడ్డి జెడ్పీ పీఠం కూడా అదే సామాజిక వర్గానికి రిజర్వ్ అయ్యింది. దీంతో చేవెళ్ల మండలం నుంచి కుమారుడిని జెడ్పీటీసీగా బరిలోకి దింపడం ద్వారా జెడ్పీ పీఠంపై కూర్చోబెట్టాలనే ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే కుమారుడు కాలె శ్రీకాంత్ ఇటీవల చేవెళ్ల మండల రాజకీయాల్లో చురుగ్గా వ్యవహరిస్తూ వస్తున్నారు. అయితే ఇలాంటి కీలక సమయంలో ఎమ్మెల్యే యాదయ్యకు స్పీకర్ నోటీసులు ఇవ్వడం.. ఆయనకు పదవీ గండం పొంచి ఉండటం ఆ కుటుంబ సభ్యులను ఆందోళనకు గురిచేస్తోంది.